క్లుప్తంగా

మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలి

కుత్బుల్లాపూర్: టీఎస్‌పీఎస్‌సీ పరీక్ష పేపర్ లీకేజీకి మంత్రి కేటీఆర్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న బీజేవైఎం నాయకులను మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్‌సీ లీకేజీపై ప్రశ్నించిన బీజేవైఎం కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టడం దారుణమన్నారు. ఈ వ్యవహారంలో మంత్రి కేటీఆర్ పీఏ పాత్ర ఉందన్నారు. లాయిబింగ్‌లో భాగంగా గ్రూప్‌–1 పరీక్షల్లో 50మంది అభ్యర్థులను అక్రమ మార్గంలో క్వాలీఫై చేశారన్నారు. దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో మంత్రి కేటీఆర్ పాత్ర ఉందన్నారు. ఆయన తక్షణమే పదవికి రాజీనామా చేసి విచారణకు సహకరించాలని కోరారు. అదే విధంగా లీకేజీపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్, మెంబర్లను బర్తరఫ్ చేయాలన్నారు. బీజేవైఎం కార్యకర్తలపై పెట్టిన కేసులను బేషరతుగా ఉపసంహరించి వారిని విడుదల చేయాలన్నారు. మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ బీజేపీ నాయకులు శేఖర్, వెంకట్, అరుణ్ ఉన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

నిజాంపేట్: అభివృద్ధి పనుల విషయంలో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై మంగళవారం ఆమె ఆయా విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోడ్ల విస్తరణ, ఎస్ఎన్‌డీపీ నాలా పనులు, ప్యాచ్‌వర్క్‌లు, భూగర్భ డ్రైనేజీ పనులపై ఆరా తీశారు. వాటిని సకాలంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు.

ఫ్లెక్సీలు తొలగించడంపై బీజేపీ ఆగ్రహం

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉగాది పండుగ సందర్భంగా బీజేపీ నేతలు వేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు తొలగించడంపై ఆ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలను తొలగించకుండా ఏకపక్షంగా బీజేపీకి సంబంధించిన ఫ్లెక్సీలను తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మంగళవారం బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆదిరెడ్డి రాజిరెడ్డి, కౌన్సిలర్ రజిని ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు. అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

డొమెస్టిక్ నుంచి కమర్షియల్

సిలిండర్లలోకి రీఫిల్లింగ్

- ఎస్‌ఓటీ తనిఖీల్లో బయటపడ్డ బాగోతం
- రూ.30లక్షల విలువైన సామగ్రిని స్వాధీనం
- ఆరుగురి అరెస్టు.. పరారీలో ఇద్దరు


◆ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ శ్రీనివాస్‌రావు.


◆ గ్యాస్ సిలిండర్లు, వాహనాలను స్వాధీనం చేసుకున్న ఎస్‌ఓటీ, జగద్గిరిగుట్ట పోలీసులు

కుత్బుల్లాపూర్: ఎస్‌ఓటీ పోలీసులు తనిఖీ చేస్తున్న క్రమంలో ఓ ఆటోను తనిఖీ చేస్తుండగా గ్యాస్ సిలిండర్ బాగోతం బయటపడింది. డొమెస్టిక్ సిలిండర్లను తీసుకువచ్చి కమర్షియల్ సిలిండర్లలోకి రీఫిల్లింగ్ చేసి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న ముఠా గుట్టు రట్టయింది. ఏకంగా 30 లక్షల రూపాయల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిని అరెస్టు చేసి మరో ఇద్దరి కోసం వేట ప్రారంభించారు. షాపూర్‌నగర్‌లోని బాలానగర్ డీసీపీ కార్యాలయంలో ఏసీపీ గంగారాం, ఎస్‌ఓటీ సీఐ రాహుల్ దేవ్, సీఐ సైదులుతో కలిసి బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు.

◆ నర్సాపూర్ ప్రాంతానికి చెందిన కె.కృష్ణ ద్వారక ఏజెన్సీ పేరు మీద గ్యాస్ ఏజెన్సీ లీజుకు తీసుకొని నడిపిస్తున్నాడు. ఇదే క్రమంలో డొమెస్టిక్ సిలిండర్లకు రూ.1150, కమర్షియల్ సిలిండర్లకు రూ.2350 ధర ఉండగా అడ్డదారుల్లో డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో డొమెస్టిక్ సిలిండర్లను తీసుకువచ్చి కమర్షియల్ సిలిండర్లలో నింపి మరో వ్యక్తి ఖాదర్‌తో కలిసి విక్రయిస్తూ వస్తున్నాడు.

◆ జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన శివ, నరేష్, సురేష్‌లతో ఫంక్షన్‌హాల్, హోటల్స్, విధి వ్యాపారులకు ఇలా వాళ్లకు అనువుగా ఉన్న ప్రాంతాల్లో రీఫిల్లింగ్ చేసిన కమర్షియల్ సిలిండర్లను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వీరికి బాచుపల్లి ప్రాంతానికి చెందిన మల్లేష్, నాగరాజ్, కార్తీక్ జత కట్టడంతో అక్కడ కూడా పలు హోటళ్లలో సరఫరా చేస్తూ వస్తున్నారు.

◆ ఇటీవల జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్‌ఓటీ పోలీసులు అనుమానంగా వెళ్తున్న ఆటోను ఆపగా అందులో గ్యాస్ సిలిండర్లు ఉన్నాయి. ఈ విషయంపై ఆరా తీయగా రీఫిల్లింగ్ బాగోతం బయటపడింది. వెంటనే తమదైన శైలిలో విచారించగా ఈ ముఠా బాగోతం వెలుగులోకి వచ్చింది.

◆ పోలీసులు వీరి వద్ద నుంచి 267 గ్యాస్ సిలిండర్లు, ఐదు వాహనాలను, నాలుగు వేయింగ్ మెషిన్లు, 26 ఫిల్లింగ్ పైప్స్, 6 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని శివ, నరేష్, సురేష్ ,మల్లేష్, నాగరాజ్, కార్తీక్‌లను అరెస్టు చేశారు. ప్రధాన సూత్రధారులుగా ఉన్న కె.కృష్ణ, అబ్దుల్ ఖాదర్ పరారీలో ఉన్నారని డీసీపీ తెలిపారు. కేసులో కీలకంగా వ్యవహరించిన బాలనగర్ ఎస్‌ఓటీ బృందాన్ని జగద్గిరిగుట్ట సీఐ సైదులును డీసీపీ శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. పరారీలో ఉన్న ఆ ఇద్దరిని పట్టుకోవాలని ఆదేశించారు.



అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి


పనులపై సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిల్ల పరిధిలో చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనులు, కొనసాగుతున్న పనులపై మంగళవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్, ఎలక్ట్రిసిటీ, టౌన్‌ప్లానింగ్, లా అండ్ ఆర్డర్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలో చేపడుతున్న సీసీ రోడ్లు, మంచినీటి పైపు లైన్లు, భూగర్భ డ్రైనేజీ, శ్మశానవాటికలు, వర్షపునీటి నాలాల నిర్మాణ పనుల పురోగతిని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

◆ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముంపు ప్రాంతాల్లో వరద నీరు చేరిందని ఆ ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ×ప్రగతి యాత్రలో భాగంగా పాదయాత్ర చేపడుతున్న తన దృష్టికి అనేక సమస్యలు వస్తున్నాయని తెలిపారు. వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేసి అవసరమయ్యే నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీలు ప్రశాంతి, మంగతాయారు, ఈఈలు కృష్ణ చైతన్య, గోవర్ధన్‌గౌడ్, డీఈఈలు శిరీష, రూపాదేవి, పాపమ్మ, భాను చందర్, డీజీఎంలు విష్ణుప్రసాద్, అప్పల నాయుడు, రాజేష్, టౌన్‌ప్లానింగ్ డీసీపీ సాంబయ్య, ఏఈలు, మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ ముస్లింలు ఎంతో పవిత్రంగా జరుపుకొనే రంజాన్‌కు ప్రభుత్వ పరంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మంగళవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖ ఉన్నతాధికారులు, మసీద్ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులతో కలిసి ఎమ్మెల్యే రంజాన్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. రంజాన్ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఉన్న మసీదుల వద్ద రోడ్ల మరమ్మతులు, పరిసరాల పరిశుభ్రత, లైటింగ్ వంటి అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సీఐలు పవన్, రమణారెడ్డి, ట్రాఫిక్ సీఐలు రాజు, చంద్రశేఖర్, ఎస్సై వెంకటేశ్వర్లు, ఇంజినీరింగ్, సర్కిల్ అధికారులు, మసీద్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొండి బకాయిలపై దృష్టి సారించాలి

దుండిగల్: వంద శాతం ఆస్తి పన్నులను వసూలు చేయాలని.. మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. గండి మైసమ్మలోని మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 31వ తేదీ వరకు పన్నులు వసూలు చేయాలన్నారు. రెవెన్యూ మేళాలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. వ్యాపారం నిర్వహించే ప్రతి షాపు యజమాని ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు.

బచ్‌పన్‌లో ఉగాది వేడుకలు

కుత్బుల్లాపూర్: వెంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్ పాఠశాలలో మంగళవారం ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది పచ్చడిని చిన్నారులు తయారు చేశారు. మన సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు వేడుకలు నిర్వహించినట్లు చైర్మన్ కోటిరెడ్డి తెలిపారు.

దేవాలయంలో శంభీపూర్ రాజు పూజలు

దుండిగల్: ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మంగళవారం నర్సాపూర్ చాకరిమెట్లలోని శ్రీసహకార ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా హోమం నిర్వహించిన అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.



